## క్లుప్తంగా

### ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్

**ముమ్మిడివరం:** ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో ఏడు వార్డు సచివాలయ కార్యాలయాల్లో ఈ నెల 22న ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జి.లోవరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరేళ్ల లోపు పిల్లల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కోసం బిడ్డ పుట్టిన తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్, తల్లితండ్రుల ఆధార్ కార్డులతో హాజరు కావాలని సూచించారు.

### ఘనంగా ప్రారంభమైన లంక తల్లమ్మ జాతర



ముమ్మిడివరంలో లంకతల్లమ్మ తీర్థ మహోత్సవాలు

**ముమ్మిడివరం:** మండల ప్రజల ఇలవేల్పు ముమ్మిడివరం లంకతల్లమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 30 వరకూ వివిధ వ్యాపార, వర్తక, కార్మిక సంఘాలు వంతుల వారీగా అమ్మవారి సంబరాలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి తీర్థ మహోత్సవాల్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిస్తున్నాయి.

### కురంగేశ్వరునికి లక్ష రుద్రాక్ష పూజ



స్వామికి లక్ష రుద్రాక్షలతో పూజ చేస్తున్న అర్చకుడు

**తాళ్లరేవు:** పాత కోరంగిలో ఉన్న బాలా త్రిపుర సుందరీ సమేత కురంగేశ్వర స్వామివారికి లక్ష రుద్రాక్ష పూజ గురువారం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు కొత్తలంక రామకృష్ణ సాయిప్రసాద్ నేతృత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి లక్ష రుద్రాక్షలతో పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### ట్రాఫిక్ నిబంధనల కరపత్రాల పంపిణీ



ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**యానాం:** ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని కోరుతూ సీఐ షణ్ముగం, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్ర స్వామి ఆధ్వర్యంలో స్థానిక బైపాస్ రహదారి, పాతబస్టాండ్, న్యూబస్టాండ్, పిల్లారాయవీధి, చిన్నాసెంటర్ తదితర ప్రాంతాల్లో వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలతో రూపొందించిన కరపత్రాలను గురువారం పంచారు. ఈ సందర్భంగా సీఐ షణ్ముగం మాట్లాడుతూ వాహన చోదకులు పరిమిత వేగంతో వాహనాలు నడపడం, భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా రోడ్డుప్రమాదాలను నివారించొచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జి.ప్రభాకరరావు, కానిస్టేబుల్ మెల్లం లోవరాజు పాల్గొన్నారు.

### నేటి నుంచి సియోచిమ్ క్రికెట్ టోర్నీ

**యానాం:** యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 30 వరకూ సియోచిమ్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పంతగడ సుమన్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగే ఈ టోర్నీలో 10 జట్లు పోటీ పడనున్నాయన్నారు. టోర్నీని ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం ప్రారంభిస్తారని చెప్పారు.

### అంబాజీపేట బస్టాండ్‌లో లీజుకు స్థలం

**అమలాపురం రూరల్:** అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని అంబాజీపేట బస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న 2730 గజాల ఖాళీ స్థలాన్ని ఐదేళ్లకు అద్దె ప్రాతిపదికన లీజుకు ఇవ్వటానికి టెండర్లు పిలుస్తున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. టెండర్ ఫారాలు అమలాపురం ఆర్టీసీ డిపో, కోనసీమ డీపీటీఓ కార్యాలయాల్లో ఈ నెల 29 తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు విక్రయిస్తారన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలు ఈ నెల 30న అంబాజీపేట బస్‌స్టేషన్‌లో సమర్పించాలన్నారు.

# వేసవి బడిగా గ్రంథాలయాలు

- జూన్ 16 వరకూ వేసవి శిక్షణ శిబిరాలు
- పుస్తక పఠనంతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

**ముమ్మిడివరం:** వేసవి సెలవుల్లో మెజారిటీ విద్యార్థులు బంధువుల ఇళ్లకు వెళ్లి ఎంజాయ్ చేస్తుంటే కొందరు విద్యార్థులు చదువు బాట పట్టారు. గ్రంథాలయాల్లో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరాల్లో చేరి విజ్ఞానంతో పాటు వినోదాన్ని పొందుతున్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఇంటర్నెట్ ప్రభావం ఎక్కువగా ఉండడంతో పుస్తకాలు చదివే పిల్లలు తగ్గిపోతున్నారు. కాస్త సమయం దొరికితే చాలు ఆండ్రాయిడ్ ఫోన్‌లతో కాలక్షేపం చేస్తున్నారు. కొందరు విద్యార్థులకైతే ఏకంగా ఇది వ్యసనంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేందుకు గ్రంథాలయ సంస్థ వేసవి ఉచిత విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేసింది.
ఏపీ పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు పలు శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభించారు. జూన్ 16 వరకూ ఇవి కొనసాగుతాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యార్థులకు ఇక్కడ వివిధ అంశాలు నేర్పిస్తున్నారు. రోజూ విద్యార్థులతో గ్రంథాలయం కళకళలాడుతోంది. వివిధ హైస్కూళ్లు, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలతో కాలక్షేపం చేస్తున్నారు. సుమారు 40 మంది విద్యార్థులు ఒకే చోట చేరి తమకు ఇష్టమైన పుస్తకాలు తీసుకుని చదుకుంటున్నారు. వేసవి సెలవుల్లో విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఉపాధ్యాయులు సూచించడంతో విద్యార్థులు ఇక్కడ అందుబాటులో ఉన్న కథలు, బాల సాహిత్యం, చరిత్ర, బాల వినోదిని, బాల భారతం, భారత రాజ్యాంగం, హక్కులు, వినియోగదారుల హక్కులు, భారత స్వాతంత్ర్య సమయోధుల పుస్తకాలు చదువుతూ తమ విజ్ఞానాన్ని మరింతగా మెరుగు పరుచుకుంటున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.

**సృజనాత్మకత పెరుగుతోంది**



విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ తరగతుల వల్ల వారిలో సృజనాత్మకత పెరుగుతోంది. స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకోవడం ద్వారా ఇంగ్లిష్ అంటే భయం పోతుంది. విద్యార్థులు సొంతంగా ఆలోచిస్తారు. ఇప్పటి నుంచే పోటీ పరీక్షల్లో గెలవాలనే ఆలోచనలో ఉంటారు. ఇక్కడ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు వారికి జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్‌పై శిక్షణ నిస్తున్నారు. – అంబటి వెంకట నారాయణ, గ్రంథాలయాధికారి, ఐ.పోలవరం

## అప్రమత్తతతో నేరాల అదుపు

సమీక్షా సమావేశంలో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



జిల్లా ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ అశోక్‌కుమార్ (చిత్రంలో ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ లతామాధురి)

**అమలాపురం టౌన్:** వేసవిలో చోరీలకు అవకాశమెక్కువని, పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయడం ద్వారా నేరాలను అదుపు చేయొచ్చని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం అమలాపురంలో పర్యటించిన ఆయన స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయం, పట్టణ పోలీసు స్టేషన్లను సందర్శించి క్రైమ్ రికార్డులను పరిశీలించారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నేరాల రేటు, అదుపు వంటి అంశాలపై లోతుగా చర్చించారు. జిల్లా ఎస్పీ సుసురాపు శ్రీధర్, ఏఎస్పీ కె.లతా మాధురి జిల్లాలో నేరాల అదుపునకు చేపట్టిన చర్యలను డీఐజీకి నివేదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అవగాహనతో అదుపు చేయాలని సూచించారు. ఎస్పీ కార్యాలయ సమీక్షలో ఎస్పీ సీఐ కోలా రజనీకుమార్, పట్టణ పోలీస్‌స్టేషన్ తనిఖీలో సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి, రూరల్ సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్ఐలు జి.హరీష్‌కుమార్, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఐజీ అశోక్‌కుమార్‌ను మహిళా పోలీసులు కలిశారు. త్వరలో రానున్న దిశ పోలీస్ స్టేషన్ గురించి చర్చించారు.

### జులై నెల కోటా విడుదల

**ఐ.పోలవరం:** ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో జరిగే కల్యాణ మహోత్సవాల టికెట్లకు సంబంధించి జులై నెల కోటా విడుదల చేసినట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో భక్తుల గోత్రనామాలతో రోజూ 116 కల్యాణాలు జరుగుతాయి. జూన్ నెలాఖరు వరకూ అన్ని తేదీలు పూర్తవడంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని జులై నెల కోటా ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

### కనకాలపేటలో పర్యటించిన ఆర్ఏఓ మునిస్వామి



కనకాలపేటలో ప్రజాసమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

**యానాం:** పలు సమస్యలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్, సర్వేయర్ కిషోర్ తదితరులు గురువారం కనకాలపేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు డ్రెయిన్లు, రహదారులు, ఆక్రమణలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. ప్రతివారం అందుతున్న ప్రజా ఫిర్యాదులకు స్పందనగా ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసిన చింతా శివ

**యానాం:** తాళ్లరేవు–యానాం జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు గురువారం యానాంకు చెందిన సామాజికవేత్త చింతా గణేష్ సమకూర్చిన ఆర్థిక సాయాన్ని ఆయన సోదరుడు చింతా శివ అందజేశారు.
ఈ సందర్భంగా మృతుల కుటుంబీకులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తంగా రూ.1.40 లక్షలను అందజేశారు. కార్యక్రమంలో మంచాల జిమ్మి, నిమ్మకాయల శ్రీనివాస్, ఈట్ఇండియా స్వామినాయుడు, పెంటపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### ఎదురెదురుగా బైక్‌లు ఢీ.. ఒకరి మృతి



వంతెనపై నిలిచిపోయిన వాహనాలు



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

**యానాం:** ఎదుర్లంక బాలయోగి వారధిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందాడు. యానాం వైపు నుంచి ఎదుర్లంక వైపు వెళుతున్న మోటార్ సైకిల్ ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే మృతుని వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశం యానాం పోలీస్ స్టేషన్ పరిధిలోనిదా లేక ఐ.పోలవరం పరిధిలోకి వస్తుందా అనే విషయం నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ ప్రమాదంతో వంతెనపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు.

## ప్రతి ఒక్కరికీ 55 లీటర్ల తాగునీరిస్తాం



సర్పంచ్ విష్ణు ఆధ్వర్యంలో జల జీవన్ మిషన్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

**అల్లవరం:** ప్రతి ఒక్కరికీ రోజుకి అవసరమైన 55 లీటర్ల తాగునీటిని పబ్లిక్ కుళాయిల ద్వారా సరఫరా చేస్తామని జల జీవన్ మిషన్ సబ్ డివిజన్ కోఆర్డినేటర్ రమేష్ అన్నారు. మొగళ్ళమూరు సచివాలయంలో సర్పంచ్ రాయుడు విష్ణు త్రిమూర్తులు అధ్యక్షతన జలజీవన్ మిషన్‌పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు.
ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ గ్రామాన నిధులు వెచ్చిస్తున్నాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి సెంటర్లో మానవహారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, కార్యదర్శి జి.వాసు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్‌కు అంతరాయం

**ఐ.పోలవరం:** మండలంలోని ఐ.పోలవరం, మురమళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ మేకా రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

### అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

**అంబాజీపేట:** మాచవరం శివారు పెచ్చెట్టివారిపాలెంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకింటికి నిప్పంటుకుని రూ.రెండు లక్షల ఆస్తి నష్టం సంభవించింది. స్థానికుల తెలిపిన వివరాలిలా.. కొప్పిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన తాటాకింటికి షార్ట్ సర్క్యూట్ సంభవించి అగ్నికి ఆహుతయింది. శ్రీనివాస్ ఇంటి అటకపై పేర్చిన కొప్పిశెట్టి బాల వెంకటరమణ (బాలాజీ)కి చెందిన రూ.1.50 లక్షల విలువైన 15 వేల కురిడీ కొబ్బరి కాయలు ఈ ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికి సర్వం బూడిద పాలయింది. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు కాలిపోయాయి. అమలాపురం అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక ఎల్ఎఫ్ ఎం.బలరామ్, వీఆర్వో ఎస్.రమణ, ఆర్ఐ ఇబ్రహీం తెలిపారు.

## ఆర్టీసీ డిపో ఎదుట చలివేంద్రం



చలివేంద్రంలో మజ్జిగ అందజేస్తున్న కండక్టర్ అరుణ



చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్ నాగేశ్వరరావు

**అమలాపురం రూరల్:** ప్రయాణికుల దాహం తీర్చేందుకు అమలాపురం ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ బీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కండక్టర్ బల్ల అరుణ దుర్గాభవాని చలివేంద్రం ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ ప్రతిమకుమారి, ఎంఎఫ్ దేవి, కుడుపూడి రాజు, పితాని మణి, బొక్కా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**సుంకరపాలెంలో...**

**తాళ్లరేవు:** సుంకరపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ టేకుమూడి నాగేశ్వరరావు మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్, వార్డు సభ్యులు పితాని అర్జునరావు, జి.సుబ్రహ్మణ్యం, ఎం.గణేష్, పలివెల సత్యవతి, సుంకర గోపి తదితరులు పాల్గొన్నారు.

**యానాంలో...**

**యానాం:** స్థానిక టాక్సీస్టాండ్ వద్ద యానాం టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. రోజురోజుకూ పెరుగుతున్న వేసవి వేడిమి దృష్ట్యా ప్రజల కోసం చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, సభ్యులు కుంచె సత్యనారాయణ, ఇళ్ల వాసు, సీఐటీయూ కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ తదితరులు చెప్పారు.

## పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- భీమనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



భీమనపల్లి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి తనయుడు శ్రీకాంత్ తదితరులు

**ఉప్పలగుప్తం:** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అడుగడుగునా పేదలకు అండగా నిలబడుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని భీమనపల్లి సచివాలయం–1 పరిధిలో బుధవారం స్థానిక నేతలతో కలిసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఆరా తీశారు.
ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలు ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. గతంలో ఎన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, వైఎస్సార్ హార్టీకల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, మేడిశెట్టి సూరిబాబు, జంపన బాపిరాజు, మానే కృష్ణ, దుర్గ, కిషోర్, బడుగు శ్రీను, గుద్దటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ



చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే అశోక్

**యానాం:** యానాం–అమలాపురం 216 జాతీయ రహదారిలోని తాళ్లరేవు సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ గురువారం పరామర్శించారు. కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నోట్ల సత్యవేణి, మల్లాడి గంగాభవాని, ఓలేటి లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, నీలిమ, గూడపనీటి ప్రభావతి, చింతపల్లి మంగాయమ్మలను పరామర్శించి ఎవరూ అధైర్య పడొద్దని బాధిత కుటుంబాలను అన్నివిధాలా అదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే మృతుల కుటుంబాలకు రూ.లక్ష, గాయపడినవారికి రూ.30 వేలు చొప్పున తాను వ్యక్తిగతంగా సహాయాన్ని ప్రకటించానన్నారు. క్షతగాత్రులకు అందుతున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత మహిళలకు మెరుగైన చికిత్సను అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు



గ్రామసభలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ

**అల్లవరం:** కౌలు రైతులకు సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో పంట రుణాలు ఇవ్వడానికి కోడూరుపాడు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. కోడూరుపాడు గ్రామ సచివాలయంలో గురువారం కౌలు రైతులకు పంట రుణాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు కలిగి స్థానికంగా నివాసముంటూ అదే గ్రామంలో వ్యవసాయం చేస్తున్న 65 ఏళ్లలోపు వయసున్న కౌలు రైతులకు రుణాలు ఇస్తారన్నారు. రుణాన్ని మొదటి విడతగా వరి నాట్లు పూర్తయిన తర్వాత 25 శాతం, 50 రోజుల తర్వాత మిగిలిన మొత్తాన్ని మంజూరు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు సూపర్‌వైజర్ శ్రీనివాస్, సలహామండలి చైర్మన్ ఆకుల శ్రీనివాసరావు, సభ్యులు వంకా రమణమూర్తి, వీఆర్ఓ నాగేంద్ర, వీఏఏ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తపడాలి



వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పరుస్తున్న డాక్టర్ సుమ

**అల్లవరం:** వేసవి ఎండల నేపథ్యంలో ప్రజలంతా వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గోడిలంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుమ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రజలకు ఆమె అవగాహన కల్పించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అలాగే శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి అయినా, లేదా శరీరం ఉష్ణాన్ని కోల్పోయినప్పుడు వడదెబ్బకు గురై చనిపోతుంటారని చెప్పారు. వడదెబ్బ పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవొచ్చన్నారు. ప్రధానంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసరమైతేనే బయటకు వెళ్లడం, వీలైనన్ని ఎక్కువ సార్లు నీరు తాగడం, నిమ్మరసం, కొబ్బరినీళ్లు తీసుకోవడం మంచిదని సూచించారు.

## ఉత్సాహంగా సమ్మర్ క్రికెట్ శిక్షణ క్యాంప్



సమ్మర్ క్రికెట్ క్యాంప్ శిక్షణలో క్రీడాకారులు

**యానాం:** పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ గుర్తింపు గల యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్–2023 గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక బాలయోగి క్రీడామైదానంలో నిర్వహించిన కోచింగ్ క్యాంప్‌కు వివిధ గ్రామాల నుంచి ఔత్సాహిక విద్యార్థులు హాజరయ్యారు. కోచింగ్ క్యాంప్‌లో భాగంగా క్రికెట్ నిబంధనలు, సూచనలు, బ్యాటింగ్, బౌలింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పి.సుమన్‌బాబు, వైజే సత్యం, కె.సుబ్బారావు, పి.రమేష్, చిట్టి, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి కేబుల్ ఆపరేటర్లు సహకరించాలి



కేబుల్ ఆపరేటర్లతో సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ గోయల్

**యానాం:** యానాం మున్సిపాలిటీకి కేబుల్ ఆపరేటర్లు పూర్తి సహకారం అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్ అన్నారు. గురువారం ఆయన అధ్యక్షతన కేబుల్ ఆపరేటర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్లు ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను పాటించాలన్నారు. ప్రస్తుతం ప్రతి కనెక్షన్‌కు రూ.7.50 పైసలు చెల్లించాలని పేర్కొన్న నివేదికను గురించి మాట్లాడారు. అనంతరం స్కైవిజన్ కేబుల్ సంస్థ అధినేత డీవీరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ టాక్స్ పేరుతో తీసుకొచ్చిన జీఎస్టీ అనంతరం దేశంలో ఎక్కడా వినోదపన్నును వసూలు చేయడం లేదన్నారు. మున్సిపాలిటీ విధించే నిబంధనలు కేబుల్ ఆపరేటర్లందరికీ ఒకేలా ఉండాలని కోరారు. అంతకుముందు గోయల్‌ను ఆపరేటర్లు దుశ్శాలువాతో సత్కరించారు.

## విత్తనం నుంచి విక్రయం వరకూ శిక్షణ



కోరంగి పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న బాబూరావు

**తాళ్లరేవు:** ప్రభుత్వం రైతులకు విత్తనం నుంచి ధాన్యం విక్రయం వరకూ శిక్షణనిస్తుందని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాబూరావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని కోరంగిలో నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి–క్షేత్ర దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పెంచుకోవాలని, నాణ్యమైన విత్తనాలు తయారు చేసుకోవాలని, అవసరమైన మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలని సూచించారు. విత్తన శుద్ధి, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు తదితర అంశాలను ఎస్.ప్రశాంతి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, దడాల లోవరాజు, వీఏఏ సాహిత్య, సిబ్బంది పాల్గొన్నారు.